# ఆనవాలు

ఎండ ఉన్నా ఉండుండి చినుకులు పడుతున్నాయి. మేఘాలు గుంపులు గుంపులుగా సముద్రం మీంచి బయటకు వస్తున్నాయి. సాయంత్రం అయిదు కావొస్తోంది. చెప్పులు చేత్తో పట్టుకుని, చీర కొద్దిగా పయికి ఎగగట్టుకుని నడుస్తున్న మాలతి పాదాలకు చివరికంటూ వస్తోన్న అలలు తగులుతున్నాయి. చేయంత దూరంలో నిరంజన్ నడుస్తున్నాడు. అతనెప్పుడూ సముద్రపు నీటికి దూరంగానే ఉంటాడు. మాలతికి అలాకాదు. ఎవరయినా తోడుంటే నీళ్ళల్లోకి వెళ్ళి ఈత కొడదామనిపిస్తుంటుంది. సముద్రమన్నా, సముద్రతీరమన్నా ఆమెకు ఎంతో ఇష్టం. తీరం వెంబడి ఎంతదూరమయినా నడుచుకుంటూ వెళ్ళాలనిపిస్తుంది. మునుపు అతను, ఆమె ఎంత దూరమయినా నడిచేవారు. ఇప్పుడు ఎంచేతనో అతనంత ఆసక్తి చూపించడం లేదు.

రెండు వారాలకొకసారయినా, ముఖ్యంగా ఆదివారాలప్పుడో, సెలవురోజు సాయంత్రాలు వాళ్ళు అక్కడకు వస్తుంటారు. తీరంలో అక్కడక్కడా పెద్ద పెద్ద రాళ్ళు విసిరేసినట్టుగా ఉన్నాయి. అతనుగాని, ఆమెగాని తినడానికి ఏవయినా తెచ్చుకుంటారు. సాయంత్రలు ఎండ చాటుగా ఏ రాయి మీదో కూర్చుని తెచ్చుకున్నవి కబుర్లు చెప్పుకుంటూ తింటూ, చీకటిపడేవరకు ఉన్నాక, అతనామెను వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ దగ్గర వదిలిపెట్టి తనింటికి వెళ్ళిపోతాడు. అతను తల్లి, తమ్ముడు చెల్లెలితో ఉంటున్నాడు. మాలతి తల్లిదండ్రులు రాజమండ్రిలో ఉంటున్నారు. ఆమెకు ముప్పయి సంవత్సరాలు వయసు వచ్చేవరకు తగిన సంబంధాల కోసం వెదికారు. మంచి సంబంధాలే వచ్చాయి. ఒకటీ రెండయితే నిశ్చితార్థం వరకూ వచ్చాయి. నిరంజన్ ప్రభావం వలన ఆమె సంబంధాలను దాటవేస్తోంటే తల్లిదండ్రులకు విసుగెత్తి చేతులు దులిపేసుకున్నారు. ఇప్పుడు మాలతికి ముప్పయి అయిదు సంవత్సరాలు. నిరంజన్‌తో కావాలసిన పెళ్ళి ఎప్పటికప్పుడు ఏదో కారణం వలన వాయిదా పడుతోంది. తన పెళ్ళి గురించి ఆమెకు ఇప్పుడిప్పుడే భయం ఏర్పడడం మొదలయింది.

సముద్రతీరాన నడుస్తున్నప్పుడల్లా ఆమెకు, గుర్తు వచ్చేది నక్షత్రపు చేప. అలలకు కొట్టుకొచ్చినవి లోగడ అక్కడక్కడ కనిపించేవి. ఇప్పుడు అట్టే కనిపించడం లేదు.

జి.పి.కరుణాకర్

నక్షత్రపు చేపలకు మెదడు ఉండదని ఎవరో చెప్పాక ఆశ్చర్యం వేసింది. ముందు నమ్మబుద్ధి కాలేదు. మెదడు లేకుండా అవి ఎలా బతకగలుగుతున్నాయని చాలా సార్లు ప్రశ్నించుకుంది. చివరకు ఎన్‌సైక్లోపీడియాలో చూశాక తన అనుమానం నివృత్తి అయింది. ఈ మాటే తన స్నేహితురాలు సుహాసినితో అంటే, ఆమె నవ్వి, 'మెదడు ఉండి మనమేం చేస్తున్నాం?' అన్నప్పుడు తన పెళ్ళి విషయం ఎత్తి చూపించినట్టు అనిపించింది మాలతికి.

దరిమిలా ఏదో పుస్తకంలోనో, నెట్‌లోనో ఒక కథ చదివింది. చిన్న కథ. పట్టుమని ఒక పేజీ కూడా లేదు. ఒక వయసు వచ్చిన వ్యక్తి సముద్రపు తీరాన నడుస్తూ ఉంటాడు. అతనికి అయిదారు అడుగుల ముందు పదిహేనేళ్ళ కుర్రాడు నడుస్తూ అలలకు కొట్టుకు వస్తున్న నక్షత్రపు చేపల్ని పట్టుకుని, వాటిని తిరిగి సముద్రంలో పడేలా విసిరేస్తున్నాడు. అది చూసి పెద్దాయన కుర్రాడితో, 'అలా ఎందుకు చేస్తున్నావు?' అని అడుగుతాడు. 'అవి తిరిగి సముద్రంలోకి వెళ్తే బతుకుతాయి కదా? సముద్రం ఒడ్డుకు కొట్టుకు వచ్చిన నక్షత్రపు చేపను పట్టుకుని సముద్రంలోకి విసిరి, 'నా ఈ చిన్నపనికి అది తిరిగి ప్రాణం పోసుకోవడం దానికి తేడాయే కదా?' అంటాడు కుర్రాడు. అది తనకు కథలా అనిపించలేదు. జీవితసత్యంలా అనిపించింది. రోజుకు నాలుగయిదు సార్లయినా ఆ కథ గుర్తు వస్తుంటుంది. ఈ కథ నిరంజన్‌కు చెప్పాలనిపించలేదు. తనిప్పుడు ఒడ్డున ఉంది.

కొద్దిగా దూరంగా ఉన్న బండమీద నిరంజన్, మాలతి పక్క పక్కన కూర్చున్నాక ఆమె నడుంచుట్టూ చేయి వేసి దగ్గరకు లాక్కుంటూంటే ఒకసారి చుట్టూ చూసింది. ఎవరూ లేరు. ఆమె మెడమీద ముద్దు పెట్టుకున్నాడు. అతను ఆమె కంటే నాలుగేళ్ళు చిన్న. అతని మెడచుట్టూ చేతులు వేసి అతని పెదాలకు తన పెదాలందించింది. వాళ్ళిద్దరూ కలుసుకుని వారం అవుతోంది.

"ఈ వేళ చలిగా ఉంది" అంది.

"అవును" అన్నాడు.

అంతకు మించి మరో మాటకయి ఎదురు చూసింది. మూడ్ లేనట్టుంది. అతను చూపులు తప్పించి ఆమె పాదాలను తన అరచేతులతో తడుముతూ, "ఏమయింది, బొబ్బలెక్కాయి" అడిగాడు.

"కొత్త చెప్పులు కరుస్తున్నాయి".

"నేనూ కొత్త షూ కొనుక్కోవాలి".

"ఒకేసారి పెళ్ళికి కొనుక్కోవచ్చు కదా, ఇంకెన్ని రోజులు?"

అతను వెంటనే జవాబు ఇవ్వలేదు. తలెత్తి కూడా ఆమె ముఖంలోకి చూడలేదు.

"మా స్నేహితురాలు సుహాసిని నిన్న గది ఖాళీ చేసి వెళ్ళిపోయింది. వచ్చే సోమవారం పెళ్ళి విజయవాడలో. పెళ్ళికి వెళ్ళొస్తాను. పెళ్ళయ్యాక ఉద్యోగం మానేస్తుందట. మన పెళ్ళి అయ్యాక నేనూ ఉద్యోగం మానేసేదా?".

"ఎందుకు మానేయడం? మానేయకు".

"నీ ఇష్టం బాబూ, నీ ఇష్టాన్ని నేనెప్పుడయినా కాదన్నానా?"

దీర్ఘంగా నిట్టూర్చాడు.

"వచ్చే నెల పదహారు లోపల నేనూ హాస్టలు గది ఖాళీ చేయాలి. ముందే నోటీసిచ్చాను. లేకపోతే అనవసరంగా రెండు వేల రూపాయలు పోతాయి. మా ఆఫీసుకు దగ్గరగా ఇల్లే మయినా దొరుకుతుందేమోనని ప్రయత్నం చేస్తున్నాను.. " ఆగి అతని ముఖంలోకి చూసింది. అతని చేతులు ఆమె కాళ్ళమీద ఉన్నాయి. దృష్టి మటుకు సముద్రం మీద ఉంది. తన మాటలు అతను వింటున్నట్టు మాలతికి అనిపించడంలేదు. మూడు వారాల కిందట రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్ళి నమోదు చేసుకున్నారు. గతంలో రెండుసార్లు నమోదు చేసుకుని వెనక్కి తీసుకున్నారు.

"నా మాటలు నువ్వు వినడం లేదు." అంది. అని అటువయిపు ఎవరో జంట వస్తోంటే చీర పాదాల వరకు లాక్కుంది. అతను ఆమె మీంచి చేతులు తీశాడు.

"చెప్పు. నన్నేం చేయమంటావు?" అడిగాడు. మాటలు పొడిగా ఉన్నాయి. కోపంగా లేవు.

"వద్దనిపిస్తోందా?"

"అదేం కాదు."

"మనమూ.... " అతని ముఖంలోకి చూస్తూ ఆగింది.

మాలతితో తన భవిష్యత్ గురించి కొత్తలో అతను బాగా ఇన్వాల్వ్ అయిపోయాడు. ఆమె లేకుండా తను బతకలేనని అనుకున్న రోజులు లేకపోలేదు. ఇప్పుడు ఆమె నుండి దూరంగా వెళ్ళిపోదామనిపిస్తోంది. మనసొప్పడం మాట అటుంచి ధయిర్యం చాలడం లేదు. ఆమెతో సాన్నిహిత్యం కొనసాగాలనీ లేదు; వదులుకోవాలనీ లేదు.

రోజుకు రెండు మూడు సార్లయినా ఫోన్‌లో మాట్లాడకుండా ఉండలేకపోతున్నాడు. ఆమె ఫోను వెంటనే తీయకపోతే వెలితిగా ఉంటుంది.

కొద్దిసేపు మవునంగా ఉండి, "నేను నీకు ఇబ్బందిగా తయారవుతున్నానేమో అనిపిస్తోంది" అన్నాడు.

"ఏ విషయంలో?"

"నువ్వు అదృష్టవతురాలివి. నీకేం సమస్యలు లేవు."

"సరే. లేవు. ఒక్కమాట చెప్పు. నాకు తెలియని నీ సమస్యలేమిటి?"

"నా తమ్ముడు..."

"అతని చదువు పూర్తికావాలన్నావు. పూర్తయింది. మంచి ఉద్యోగంలోనే చేరాడు. మీ చెల్లెలు చదువు పూర్తి కావడానికి మరో రెండేళ్ళు పడుతుంది. ఆమె పయి చదువులకు గాని పెళ్ళికి గాని నేను తప్పకుండా సహాయం చేస్తానన్నాను కదా? మీ తమ్ముడి చదువుకు నేనేం సహాయం చేయలేదా?" తను చేసిన సహాయం గురించి అనకూడదనుకుంది గాని అనకుండా ఉండలేకపోయింది.

"దెప్పుతున్నావా?" నెమ్మదిగా అడిగాడు.

"లేదు. ఇన్ని సంవత్సరాలు స్నేహం చేశాక, నువ్వింతేనా నన్ను అర్థం చేసుకుంది?"

"......."

"అసలు మీ వాళ్ళకు మన పెళ్ళి గురించి చెప్పావా?"

"నువ్వు నాకంటే నాలుగయిదు సంవత్సరాలు పెద్దదానివని ఆగాను. చెప్పలేదు."

"మనకు పరిచయమయిన కొత్తలోనే నా వయసు గురించి చెప్పాను."

అవునన్నట్టు తలూపాడు.

"ఆ విషయం ఇప్పుడెందుకు గుర్తు చేస్తున్నావు?"

"సారీ... సారీ... ఆఫీసుపని ఒత్తిడి వలన, మా బాస్ వేధింపుల వలన మనసు చికాకుగా ఉంది. అలా అన్నాను. అయాం రియల్లీ సారీ. నీతో ఒక్క గంట గడిపితే చాలు, ఆఫీసులో వారం రోజులు పడిన బాధంతా మర్చిపోతాను."

అతని మాటలు మాలతికి కొన్నిసార్లు నిజం అనిపిస్తాయి. కొన్నిసార్లు అబద్ధం చెబుతున్నట్టుగా ఉంటాయి. "మనిద్దరం ఒక కుటుంబంగా ఉండాలనుకోవడం తప్పా?" అడిగింది.

నిరంజన్ తల అడ్డంగా ఆడించి, "కాదు... ఏదో చెబుదామనుకుంటూ మర్చిపోయాను." అన్నాడు.

"ఏం చెప్పాలనుకుంటున్నావు?"

అతనామె ముఖంలోకి చూసి ఏదో చెప్పబోయి ఆగాడు.

"మన గురించా, నా గురించా?" అడిగింది.

"ఈ సంభాషణ ఇక్కడితో ఎందుకు ఆపకూడదు?"

"ఎన్నాళ్లని?"

అతను జవాబు చెప్పలేదు.

"పోనీ... ఒక్క మాట చెప్పు. దెప్పుతున్నానని అనుకోకు. నీ కోసం నేనేం చేయలేదు? మా వాళ్ళందరినీ వదులుకోలేదూ?"

"కాదనడం లేదు... ఈ వేళ ఏమయింది నీకు? ఇంకొన్నాళ్ళు ఓపికపట్టు.. అన్నీ..."

"ఇంకెన్నాళ్ళు?"

"ప్రతిసారీ ఏదో చెప్పి నిన్ను మభ్యపెట్టడం నాకూ మంచిగా అనిపించడం లేదు. తప్పనిపిస్తోంది. నేను ముందు కొచ్చి నిలబడే వరకు ఓపికపట్టలేకపోతే ఏం చేయగలను?"

మాలతి రాయి దిగి, చీర సవరించుకుని చెప్పులు తొడుక్కుంది. పాదాల మీదున్న బొబ్బలు పగిలినా బాధనిపించలేదు. అతనూ దిగాడు. గాలి విసురుగా వీస్తోంది. చినుకులు పడడం లేదు. ఎండ బయటకు వచ్చింది. ఇద్దరూ రోడ్డు వయిపు నడవసాగారు. చీకటి పడకముందే అక్కడినుండి కదలడం అదే మొదటిసారి. త్వరగా విడిపడడానికి ఇష్టపడరు.

తారు రోడ్డు మీదకు వచ్చి దాటాక నిరంజన్ మాలతి కుడిచేయి పట్టుకున్నాడు. చెప్పులు కరిచిన చోట పాదాలు సలుపుగా ఉన్నాయి.

"దయచేసి నా పరిస్థితి అర్థం చేసుకో" అన్నాడు.

అతని కంఠస్వరం ఆమెకు కొత్తగా ధ్వనించింది. అతని స్పర్శ చల్లగా, మెత్తగా ఎవరి చేయిలానో అనిపించింది. మాటలు కూడా ఎవరివో అన్నట్టుగా ఉన్నాయి. తను తనుగా ఆమెకు అనిపించడంలేదు. అసలా ప్రదేశానికి రావడం అదే మొదటిసారిలా అనిపిస్తోంది.

ఎడమచేత్తో అతని చేతిని తన కుడిచేతి మీంచి నెమ్మదిగా తప్పించి. కుదుట పడుతున్న మనసును కదలనీయకుండా పట్టుకుని అతని ముఖంలోకి చూసింది. ఆ కళ్ళల్లోకి చూస్తూ తను ఎన్ని కలలు కన్నది? ఎన్ని సౌధాలు నిర్మించుకుంది? ఎన్ని బాసలు? ఏమయి పోయాయి అవన్నీ? ఇహ అతనిని చదవాల్సిన అవసరం లేదు. తప్పు అతనిది కాదు. తనది. సుహాసిని మగాళ్ల గురించి ఎన్నిసార్లు చెప్పినా తను వినిపించుకోలేదు. ఎవరో దోచేసుకున్నట్టు మనసు ఖాళీ అయింది.

అతను ముందుకు నడిచి రోడ్డు పక్క ఉన్న బస్టాప్ వెనక పార్కు చేసిన మోటార్ బయిక్ తీసి, స్టార్టు చేసి, "కూర్చో, మీ హాస్టలు దగ్గర నిన్ను వదిలిపెడ్తాను" అన్నాడు.

"ఇప్పుడిప్పుడే హాస్టలుకు వెళ్ళాలని లేదు. ఇటు పక్కకు వెళ్ళి జగదాంబ సెంటరులో పనుంది. సిటీ బస్సులో వెళ్ళిపోతాను."

"నామీద కోపంగా ఉంది కదూ?"

నవ్వి, తల అడ్డంగా ఆడించి, "లేదు, అదేం లేదు..." అంది.

"ఏయ్.. నిజం చెప్పు. ఇందాకటి విషయం గురించే ఆలోచిస్తున్నావు కదూ? కూర్చో. ఈ మోటర్ బయిక్ నీదే. నువ్వు కొనిచ్చిందే..."

మాలతి కూర్చోలేదు, "బై" అంది.

అతని బండి కనుమరుగవ్వగానే ఒడ్డుకొచ్చిన నక్షత్రపు చేపను తిరిగి సముద్రంలోకి విసిరేసినట్టనిపించింది. ఎదురుగా ఉన్న బస్‌స్టాప్ వయిపు కదిలి, రోడ్డు మధ్యకు వచ్చింది. పాదాలు మంట పెడుతున్నాయి. ఎండ కళ్ళల్లో గుచ్చుకుంటున్నా ఇటు పక్కనుండి వస్తున్న కారును, అటుపక్కనుండి వస్తున్న ఆయిలు టేంకరును చూడలేదని కాదు. అప్పటికే రోడ్డు మధ్యకు వచ్చేసింది. రోడ్డు వెడల్పాటిదేం కాదు. ఆయిలు టేంకరు డ్రయివరు హారన్ కొడుతూ అరుస్తూనే ఉన్నాడు. మాలతి మిగల్లేదు. ఆమె కుడచేతి గుప్పిటలో తను పెళ్ళి కోసం కొని, నిరంజన్‌కు చూపిద్దామని తీసుకువచ్చిన రెండుపేటల నల్లపూసల దండ మటుకు చెక్కు చెదరలేదు.

* సాక్షి - ఫన్‌డే, 21 నవంబరు 2010